క్లుప్తంగా

ఏజీపీగా సదానందం



హుస్నాబాద్: హుస్నాబాద్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా ఒగ్గోజు సదానందం నియమితులయ్యారు. ఈమేరకు సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవీ కాలం ఆరు నెలలు ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కేజ్‌వీల్స్‌తో రోడ్లపైకి వస్తే చర్యలు

సిద్దిపేటకమాన్: కేజ్‌వీల్స్ ట్రాక్టర్ రోడ్డుపైకి వస్తే చర్యలు తీసుకుంటామని సిద్దిపేట సీపీ అనురాధ ఆదివారం హెచ్చరించారు. ప్రభుత్వం ఎన్నో రూ.కోట్లు వెచ్చించి రోడ్లు నిర్మిస్తోందని, కేజ్‌వీల్స్ రాకపోకలతో అవి ధ్వంసమవుతున్నాయన్నారు. పొలాలకు వెళ్లే ట్రాక్టర్ల యజమానులు కేజ్‌వీల్స్ లేకుండా వెళ్లాలన్నారు.

పుస్తకాల బహూకరణ



పుస్తకాలు అందజేస్తున్న 1983-84 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

హుస్నాబాద్: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగుల కోసం పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ ఆదివారం గ్రంథాలయానికి పుస్తకాలను బహూకరించారు. వివిధ పరీక్షలకు మరిన్ని పుస్తకాలు కావాలని స్థానికులు అడిషనల్ కలెక్టర్‌ను కోరగా ఆయన తన స్నేహితుల ద్వారా గ్రంథాలయానికి పుస్తకాలను అందజేశారు. హుస్నాబాద్ ప్రాంత విద్యార్థులు మంచి భవిష్యత్‌ను నిర్మించుకోవాలని ఆయన పంపిన సందేశంలో కోరారు. కార్యక్రమంలో లైబ్రరి ఇన్‌చార్జి బాలయ్య, లావణ్య, కొండూరి శ్రీనివాస్, కొత్తపల్లి అశోక్, వెంకటరమణారెడ్డి, కన్నోజు శ్రీనివాస్, జగన్, రాజబ్రహ్మాచారి, కరణ్ పాల్గొన్నారు.

ప్రజాసేవే ముఖ్యం

మాజీ జెడ్పీటీసీ భూక్య మంగ



భూక్య మంగను సన్మానిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

హుస్నాబాద్: అక్కన్నపేట జెడ్పీటీసీగా పదవీ విరమణ పొందిన భూక్య మంగను హుస్నాబాద్‌లో ఆదివారం గిరిజన సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2014లో హుస్నాబాద్ ఎంపీపీగా, 2019లో అక్కన్నపేట జెడ్పీటీసీగా గెలిపించిన హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. పదేళ్ల పదవీ కాలంలో గిరిజన తండాలకు రోడ్లు, తాగునీటి సౌకర్యంతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని తెలిపారు. తన హయాంలో తండాలు గ్రామ పంచాయతీలుగా ఏర్పడటం సంతోషంగా ఉందన్నారు. పదవి లేకున్నా ప్రజలకు సేవ చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాంచంద్రం నాయక్, వీరన్న నాయక్, రాజు నాయక్, భిక్షపతి నాయక్, రంగా నాయక్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎంసెట్ కౌన్సెలింగ్



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

నంగునూరు(సిద్దిపేట): రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో ఎంసెట్ కౌన్సెలింగ్ కొనసాగుతోంది. ఆదివారం 500 మంది విద్యార్థులు హాజరయ్యారు. అధికారులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించి లాగిన్ ఐడీ, పాస్‌వర్డు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సూర్యనారాయణ మాటాడుతూ ఐడీ పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో కళాశాల కోసం ఆప్షన్లు పెట్టుకోవాలన్నారు.

హత్యారాజకీయాలను ఖండించాలి

హుస్నాబాద్: బీఎస్పీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అర్మ్ స్ట్రాంగ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేయడం హేయమైన చర్య అని ఆ పార్టీ నాయకులు అన్నారు. ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. దేశంలో హత్యారాజకీయాలను అన్ని పార్టీలు ఖండించాలని, వెంటనే దోషులను అరెస్ట్ చేసి శిక్షించాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్, నాయకులు డేగల వెంకటేశ్వర్లు, సుధాకర్, ఎలగందుల శంకర్, వెల్పుల రాజు, శరత్ పాల్గొన్నారు.

నీరు లేక.. సాగు చేయలేక

- బోసిపోయిన చెరువులు, కుంటలు
- ఆయకట్టు రైతులు ఆగం
- కార్తెలు కరిగినా కరుణించని వరుణుడు
- తుకాలు పోసి ఎదురుచూస్తున్న రైతులు

చెరువులు, కుంటల్లో నీటి జాడ కరువైంది. జలాశయంలో నీరు లేకపోవడంతో పంటల సాగు చేపట్టిన రైతులు తలలు పట్టుకున్నారు. వర్షం కురిస్తే దున్నకాలు చేపడదామని అన్నీ సిద్ధం చేసుకున్నారు. ముందు మురిపించిన వరుణుడు ప్రస్తుతం ముఖం చాటేయడంతో ఇప్పటి వరకు వరినాట్లు ప్రారంభించలేదు. తుకం పోసి చినుకు కోసం ఆకాశం వైపు రైతులు ఎదురు చూస్తున్నారు.



తిగుల్‌లో ఎండిన రాచకట్ల జలాశయం

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ మండలంలోని 29 గ్రామాల్లో మొత్తం 42 చెరువులు, కుంటలు ఉన్నాయి. అలాగే తిగుల్ రాయవరం గ్రామాల మధ్య నిర్మించిన రాచకట్ల జలాశయం, ధర్మారం గ్రామంలో బోరబండ ప్రాజెక్టు ఉంది. గతేడాది వర్షాలు పుష్కలంగా కురవడంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. ఆరుద్ర కార్తెలోనే నాట్లు వేసే పనులు ముమ్మరంగా కొనసాగాయి. కానీ, ఈసారి రోహిణి కార్తెలో వర్షాలు కురవడంతో రైతులు ముందుగానే పత్తి పంటలను సాగుచేశారు. వరినారుకు మృగశిర, ఆరుద్ర కార్తెలో తుకం పోశారు. తుకం మొలిచి నాటుకు సిద్ధమవుతున్నా వర్షాలు కురవకపోవడంతో ఆయకట్టు రైతులు దుక్కి దున్నకుండా చినుకు కోసం ఎదురు చూస్తున్నారు. బోరు బావుల్లో నీటి శాతం కూడా తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద పూసాల కార్తె ప్రారంభమైనా ఇప్పటికీ భారీ వర్షం పడలేదు. దీంతో రైతులు ఈసారి వ్యవసాయం కష్టమే అంటూ ఆందోళన చెందుతున్నారు. పత్తి పంట రక్షణ కోసం బోరు బావులు ఉన్న రైతులు స్ప్రింకర్లతో నీటి తడులు అందిస్తున్నారు. మండలంలోని ఎనిమిది వేల ఎకరాలకు పైగా వరిసాగయ్యే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు అంచానా వేశారు. అలాగే జిల్లాలో మూడు లక్షలకు పైగా వరిసాగయ్యే అకాశాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు.



వరినాట్లకు సిద్ధంగా ఉన్న నారు

వెలవెల బోతున్న చెరువులు

వర్షాలు సకాలంలో కురవకపోవడంతో మండలంలోని చెరువు కుంటలన్నీ వెలవెలబోతున్నాయి. రాచకట్ల జలాశయంలో నీళ్ల లేక నెర్రెలు బారుతోంది. బోరబండ ప్రాజెక్టు కూడా దాదాపు ఇదే పరిస్థితి. నీళ్ల లేక గ్రామాల్లో చెరువు కుంటలన్నీ బోసిపోతున్నాయి. ఆయా గ్రామాల ఆయకట్టు రైతులు చెరువు కుంటలు నిండితేనే వరిసాగు చేస్తారు. కానీ, వర్షాలు లేక తుకాలు పోసి వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు.



ఆయకట్టు కింద బీడుగా ఉన్న పొలాలు

వానొస్తేనే దున్నకాలు



మా గ్రామంలో మహాసముద్రం చెరువు ఆయకట్టు కింద ఎకరం భూమి ఉంది. గత 20 రోజుల క్రితమే తుకం పోశాం. కానీ, ఇప్పటి వరకు వర్షం కురియక పోవడంతో పొలం దున్నలేదు. వానొస్తేనే దున్నడమవుతుంది. వర్షాలు ఇలాగే ఉంటే పోసిన తూకం ముదిరిపోతుంది.

– జంగని కిష్టయ్య, రైతు, తిగుల్

వర్గీకరణ సాధనకు 30 ఏళ్లుగా పోరాటం



చిన్నకోడూరులో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



హుస్నాబాద్‌లో కేక్ కట్‌చేస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం చిన్నకోడూరులో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అలాగే మంద కృష్ణ జన్మదినం పురస్కరించుకుని కేక్‌కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనకు 30 ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేస్తున్నామన్నారు. వర్గీకరణతో పాటు పేదల పక్షాన పోరాటాలు చేసి ఎన్నో విజయాలు సాధించామన్నారు. మంద కృష్ణ నేతృత్వంలో బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కనకయ్య, రాజు, రమేష్, కల్యాణ్, మహేష్, యాదగిరి పాల్గొన్నారు.

తక్షణమే ఏబీసీడీ వర్గీకరణ

హుస్నాబాద్: ఎస్సీ రిజర్వేషన్లలో వర్గీకరణ లేకపోవడంతో మాదిగలు, మాదిగ ఉపాధి కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని తక్షణమే ఏబీసీడీ వర్గీకరణ జరగాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్ల వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు ఏర్పడిన దండోరా 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దండోరా జెండాను ఆవిష్కరించారు. వ్యవస్థాక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పుట్టిన రోజు కూడా కావడంతో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి కొలుగూరి అశోక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతిని జయప్రదం చేద్దాం

సిద్దిపేటఅర్బన్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించాలని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్‌గుప్తా పిలుపునిచ్చారు. జూలై 8న వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి సందర్భంగా అన్ని మండలాల్లో అభిమానులు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

ఎన్నికలేవైనా బీజేపీ గెలుపు ఖాయం



గజ్వేల్‌లో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: ఎన్నికలు ఏవైనా బీజేపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్ వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ ఎంపీగా గెలుపొందిన రఘునందన్‌రావుకు కృతజ్ఞత సభను ఈనెల 9వ తేదీన గజ్వేల్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కష్టపడే ప్రతీ కార్యకర్తకు పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, నాయకులు ఎల్లు రాంరెడ్డి, కుడిక్యాల రాములు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



1990-91 బ్యాచ్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

దుబ్బాకటౌన్: దుబ్బాక జిల్లా పరిషత్ బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజిరెడ్డి, మల్లేశం, భాస్కర్‌రెడ్డి, జగన్నాథం, ప్రేమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక**



సిద్దిపేటజోన్: 50వ జూనియర్ జాతీయ స్థాయి ఆక్వాటిక్ వాటర్ పోలో ఛాంపియన్ 2024 టోర్నీకి సిద్దిపేటకు చెందిన యహాశ్విన్ రాజ్ ఎంపికయ్యాడు. సికింద్రాబాద్ ఎంసీహెచ్ స్విమ్మింగ్ పూల్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈనెల 8వ తేదీ నుంచి మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. యహాశ్విన్‌రాజ్‌ను సిద్దిపేట స్విమ్మింగ్ అసోసియేషన్, క్రీడా సమాఖ్య, వాలీబాల్ అసోసియేషన్, అథ్లెటిక్స్ అసోసియేషన్, ఫుట్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు మల్లికార్జున్, సాయిరాం, రవీందర్ రెడ్డి, వెంకట్ స్వామి, అక్బర్ అభినందించారు.

◆ **అంబేడ్కర్ అభయహస్తం అమలు చేయాలి**

జగదేవ్‌పూర్(గజ్వేల్): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అంబేడ్కర్ అభయహస్తం పథకాన్ని ప్రవేశపెట్టి అర్హులైన దళితులకు అందించాలని అంబేడ్కర్ సంఘ రాష్ట్ర నాయకుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు దళితులకు ఇచ్చిన హామీ మేరకు అంబేడ్కర్ అభయహస్తం పథకాన్ని వెంటనే ప్రవేశ పెట్టాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలవుతున్నా నేటికీ ఈ పథకాన్ని ప్రవేశపెట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

◆ **మట్టి స్నానంతో అనారోగ్యానికి చెక్**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): చర్మవ్యాధులు, శారీరక రుగ్మతలను మట్టి స్నానంతో పోగొట్టొచ్చని యోగి పరమేశ్వర యోగ ఫౌండేషన్ ఆచార్యులు యోగా వంశీకృష్ణ అన్నారు. ఆదియోగి పరమేశ్వర యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేటలో మట్టి స్నాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యోగా గురువులు బొజ్జ అశోక్, ఎలిగేటి కృష్ణమూర్తి, పెద్ది మనోహర్, ఆది యోగి పరమేశ్వర యోగ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సిద్ది రాములు, తుల్జాపూర్ వినోద్ పాల్గొన్నారు.

◆ **తునికి నల్లపోచమ్మకు పూజలు**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి కుమార్చన చేశారు. బోనాలు సమర్పించి ఒడిబియ్యం పోశారు. అమ్మవారి నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. బోనాలు సమర్పించే సమయంలో శివసత్తుల విన్యాసాలు అలరించాయి.

వృథాగా పోతున్న భగీరథ నీరు



పైపు పగిలి ఎగజిమ్ముతున్న నీరు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ గ్రామంలోని రక్షిత వాటర్ ట్యాంక్ వైపు లైన్‌కు ఆదివారం లీకేజీ ఏర్పడింది. దీంతో మిషన్ భగీరథ నీరు వృథాగా పోతోంది. సంబంధిత అధికారులు స్పందించి పైపు లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



విద్యార్థులను సన్మానిస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



దుద్దెడలో రక్షితకు నగదు బహుమతి అందజేస్తున్న ఆదర్శ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు

దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకొని దుబ్బాకకు మంచి పేరు తేవాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం దుబ్బాక సీఎస్‌ఆర్ క్యాంపు కార్యాలయంలో ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థులను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న హయాంలో ఏర్పాటు చేసిన మోడల్ స్కూల్ విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి పెద్దసంఖ్యలో ఎంపికయ్యారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కాకుండా, పలు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీచేసిందన్నారు. ప్రభుత్వ విద్యపై అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

నగదు బహుమతి అందజేత

కొండపాక(గజ్వేల్): ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన కుకునూరుపల్లి మండలం లకుడారం హైస్కూల్ విద్యార్థిని నాగపురి అనూషను బీసీ జిల్లా అధ్యక్షుడు కందూరి ఐలయ్య ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. విద్యార్థినిని అభినందిస్తూ రూ.వెయ్యి నగదు బహుమతి అందజేశారు.

దుద్దెడలో..

మండలంలోని దుద్దెడకు చెందిన పబ్బోజు రక్షిత బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినందుకు ఆదివారం ఆదర్శ ఫ్రెండ్స్ అసోసియేషన్ తరుపున రూ.10 వేల నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మిద్దె రమేష్ మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాదన్నారు. రక్షిత తల్లిదండ్రులు కూలీ పనులు చేస్తూ కూతురును చదివించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భాకి ప్రభాకర్, ఉపాధ్యక్షుడు పంజాల శ్రీనివాస్, కోశాధికారి మిద్దె శివకుమార్, సభ్యులు మొయినొద్దీన్, కుమార్, నరేందర్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీరాములు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి

ఎంపీ రఘునందన్‌రావు



ఎంపీని కలిసిన నీలకంఠ సంఘం నాయకులు

దుబ్బాక: కులవృత్తిపై ఆధారపడ్డ చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం దుబ్బాక నీలకంఠ సంఘం సభ్యులు హైదరాబాద్‌లో ఎంపీని కలిసి తమ సమస్యలు వివరించారు. నీలకంఠ కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి కాలేదని పూర్తి చేయడానికి రూ.10 లక్షలు మంజూరు చేయాలని కోరడంతో ఆయన స్పందించి నిధులు ఇస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ చేనేత కార్మికుల పరిస్థితి చాలా దయనీయంగా మారిందని, వారి సంక్షేమానికి చర్యలు తీసుకుంటానన్నారు. దుబ్బాకలో చేనేత కార్మికులకు ఉపాధి కరువై చాలా ఇబ్బందులు పడుతున్న పరిస్థితులను తాను స్వయంగా చూశానన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు అంబటి బాలేష్‌గౌడ్, నీలకంఠ సంఘం నాయకులు మర్గల సత్యానందం, గవ్వల రమేష్, కాల్వ లక్ష్మీనారాయణ, రాంచంద్రం తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



విద్యార్థులకు దుప్పట్లు, నోట్ బుక్స్ అందజేస్తున్న వార్డెన్

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని గజ్వేల్ ఎస్టీ హాస్టల్ వార్డెన్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని జాలిగామ బైపాస్‌లోగల ఎస్టీ హాస్టల్‌లోని విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన దుప్పట్లు, టవల్స్, నోట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతును రాజుగా చేయడమే లక్ష్యం



శనీశ్వరాలయంలో పూజలు చేస్తున్న హరికృష్ణ

సిద్దిపేటరూరల్: రైతును రాజుగా చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చిన్నగుండవెల్లి గ్రామంలోని శనీశ్వరాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుకున్నామన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ నాయకులు మహిపాల్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు లక్ష్మారెడ్డి, చంద్రారెడ్డి, రాంరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణించేదెలా?



కంకర పరిచిన కట్కూర్ - దాస్‌తండా రోడ్డు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం కట్కూర్ నుంచి దాస్‌తండా వయా వంకాయతండా, పంచరాయితండాల రహదారి అధ్వానంగా మారింది. తండావాసులకు రవాణా సౌకర్యం కల్పించేందుకు గత ప్రభుత్వంలో బీటీరోడ్డు నిర్మాణానికి గిరిజన సంక్షేమ శాఖ ద్వారా దాదాపు రూ.3.20 కోట్లు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ మట్టిరోడ్డును తవ్వి కంకర పోసి వదిలేయడంతో తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలుపడుతున్నామని వాపోయారు. అంతేకాకుండా రోడ్డు వెడల్పు తగ్గించి నిర్మిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నాడన్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం వందలాది కుటుంబాలు పాలు పోసేందుకు కట్కూర్ గ్రామానికి వెళ్తాయని, పిల్లలు హుస్నాబాద్‌లోని స్కూల్‌కు వెళ్తేందుకు నానా అవస్థలుపడుతున్నట్లు చెబుతున్నారు. రోడ్డంతా కంకర తేలి ఉండటంతో ప్రైవేట్ బస్సు తండా వరకు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి త్వరగా బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.